
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

గురువారం ၊ 6 ၊ ఫిబ్రవరి ၊ 2025



సోమశిలలో 65.93 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో బుధవారం సాయంత్రానికి 65.93 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎగువ ప్రాంతాల నుంచి 1313 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.87,370
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.7,948
3 శాతం జీఎస్టీతో	రూ.8,186
నవర (8 గ్రా)	రూ.65,488

వాతావరణం

గరిష్టం/కనిష్టం 34.6 /22.7

జిల్లాలో వాతావరణం గురువారం పొడిగానే ఉంటుందని ఆ శాఖ అధికారులు తెలిపారు. గాలిలో తేమ 61 శాతంగా బుధవారం నమోదైంది.

న్యూస్‌రీల్

19 నుంచి టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు పరీక్షలు

నెల్లూరు (టౌన్): టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సుకు సంబంధించిన లోయర్, హయ్యర్ గ్రేడ్, డ్రాయింగ్, టైలరింగ్ ఎంబ్రాయిడరీ పరీక్షలను ఈ నెల 19 నుంచి 22 వరకు నిర్వహించనున్నామని డీఈఓ బాలాజీరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. హ్యాండ్లూమ్ వీవింగ్ ప్రాక్టికల్స్‌ను ఈ నెల 19 నుంచి 28 వరకు నిర్వహించనున్నారని చెప్పారు. వివరాలకు www.bseap.org.inను సంప్రదించాలని సూచించారు.

ఇంటర్ ఒకేషనల్ ప్రాక్టికల్స్ ప్రారంభం



పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న శ్రీనివాసులు

నెల్లూరు (టౌన్): ఇంటర్ ఒకేషనల్ ప్రాక్టికల్స్ బుధవారం ప్రారంభమయ్యాయి. ఉదయం నిర్వహించిన ప్రాక్టికల్స్‌కు 284 మందికి గానూ 264 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షకు 265 మందికి గానూ 19 మంది గైర్హాజరయ్యారు. బీవీనగర్‌లోని జీవీఆర్ఆర్ జూనియర్ కళాశాలను ఆర్ఐఓ శ్రీనివాసులు.. రెండు పరీక్ష కేంద్రాలను డీవీఈఓ మధుబాబు తనిఖీ చేశారు.

విద్యుత్ బిల్లు సవరింపు

సాక్షి ఎఫెక్ట్..

ఆత్మకూరు: పట్టణంలోని ఓ సామిల్లుకు జారీ చేసిన అధిక విద్యుత్ బిల్లును ఆ శాఖ అధికారులు సవరించారు. 'స్మార్ట్ మీటర్ గుండె గుబిల్లు' అనే శీర్షికన సాక్షిలో కథనం బుధవారం ప్రచురితమవడంతో డీఈఈ శ్రీనివాసరావు ఆదేశాలతో ఏడీఈ చిన్నస్వామి, ఏఈ లావణ్య సంబంధిత సామిల్లులో పరిశీలించారు. స్మార్ట్ మీటర్ ఏర్పాటు సమయంలో జరిగిన సాంకేతిక సమస్యతో ఇలా బిల్లు నమోదైందని, దీన్ని సరిచేసి అందజేశామని ఏడీఈ తెలిపారు. స్మార్ట్ మీటర్ల కారణంగా బిల్లులు అధికంగా రావని, టారిఫ్ ప్రకారం వినియోగించిన యూనిట్లకు మాత్రమే వస్తుందని, ఎలాంటి అపోహలొద్దని చెప్పారు.

తెల్లరాయి లారీ పట్టివేత



వింజమూరు(ఉదయగిరి): తెల్లరాయిని అక్రమంగా తరలిస్తున్న లారీని వింజమూరులోని చెక్‌పోస్ట్ వద్ద పోలీసులు మంగళవారం రాత్రి పట్టుకున్నారు. దుత్తలూరు మండలం నుంచి చెన్నై వెళ్తుండగా, పట్టుకొని కేసు నమోదు చేసి మైనింగ్ అధికారులకు అప్పగించామని ఎస్సై వీరప్రతాప్ తెలిపారు. ప్రకాశం జిల్లా బేస్తవారిపేట నుంచి బోగస్ పర్మిట్ల ద్వారా వీటిని తరలిస్తున్నారన్నారు.

సప్లిమెంటరీ పరీక్షలకు ఆరుగురి గైర్హాజరు

వెంకటాచలం: విక్రమ సింహపురి యూనివర్సిటీ పరిధిలో బుధవారం నిర్వహించిన డిగ్రీ మెగా సప్లిమెంటరీ పరీక్షలకు ఆరుగురు విద్యార్థులు గైర్హాజరయ్యారని వీఎస్‌యూ పరీక్షల నిర్వహణాధికారి మధుమతి తెలిపారు. ఉదయం, మధ్యాహ్నం నిర్వహించిన ఒకటో, నాలుగో సెమిస్టర్ పరీక్షలకు 34 మందికి గానూ 28 మంది హాజరయ్యారని చెప్పారు.

విలీనాన్ని నిరసిస్తూ ఆందోళన



ఆత్మకూరు రూరల్: మండలంలోని నాగులపాడులో గల ఎంపీపీఎస్ పాఠశాలలో మూడో, నాలుగో, ఐదో తరగతులను చెర్లోయడవల్లి ప్రాథమిక పాఠశాలలో విలీనం చేయడాన్ని వ్యతిరేకిస్తూ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు నిరసనను బుధవారం చేపట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ సోమవరపు వెంకటరమణారెడ్డితో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడారు. గుణాత్మక విద్యను అందిస్తున్నారని, ఈ క్రమంలో ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు చెర్లోయడవల్లి పాఠశాలలో విలీనం చేయడం సమంజసం కాదని చెప్పారు. మూడు కిలోమీటర్ల దూరంలోని చెర్లోయడవల్లికి రాకపోకలు సాగించేందుకు చిన్నారులు అనేక ఇబ్బందులు పడాల్సి వస్తుందని చెప్పారు. విద్యాశాఖ అధికారులు స్పందించి నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు.

రక్తసిక్త రహదారులు



బుజబుజనెల్లూరు సమీపంలో గుంతలమయంగా జాతీయ రహదారి

జిల్లాలోని ప్రధాన రహదారుల్లో ఎక్కడో ఓ చోట నిత్యం మరణ మృదంగం మోగుతూనే ఉంది. డ్రంక్ అండ్ డ్రైవింగ్.. మితిమీరిన వేగం.. ఓవర్‌లోడ్.. నిర్లక్ష్యంగా వాహనాలను నడపడం ఓ కారణమైతే.. అస్తవ్యస్తంగా మారిన రోడ్లు మరో కారణమవుతున్నాయి. ముక్కుపిండి మరీ టోల్‌ను వసూలు చేస్తున్న కాంట్రాక్టర్లు, నేషనల్ హైవే అధికారులు రోడ్ల బాగును విస్మరిస్తున్నారు. వెరసి యాక్సిడెంట్లలో పదుల సంఖ్యలో మృత్యువాత పడుతుండగా, క్షతగాత్రులవుతున్న వారి సంఖ్య కోకొల్లలు. ఈ తరుణంలో రోడ్డు సేఫ్టీపై ప్రజలకు అవగాహన కల్పించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రహదారి భద్రత మాసోత్సవాలను ఈ నెల 15 వరకు నిర్వహించనున్నారు.

జిల్లాలో ఏటా వందల సంఖ్యలో ప్రమాదాలు

- నిత్యం ఎక్కడో ఓ చోట
- దుర్భరంగా మారిన నేషనల్ హైవేలు
- 54 బ్లాక్ స్పాట్ల గుర్తింపు
- ఈ నెల 15 వరకు రహదారి భద్రత మాసోత్సవాలు

జిల్లాలో ఇలా..

జిల్లాలోని ఉలవపాడు నుంచి మనుబోలు వరకు (ఎన్‌హెచ్ – 16) 130 కిలోమీటర్లు.. నెల్లూరు నుంచి వైఎస్సార్ జిల్లా సరిహద్దు వరకు (ఎన్‌హెచ్ – 67) 120 కిలోమీటర్లు.. వెంకటగిరి నుంచి ప్రకాశం జిల్లా సరిహద్దు పామూరు వరకు (ఎన్‌హెచ్ – 565) 150 కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్నాయి. ఇవి కాకుండా వందల కిలోమీటర్ల మేర స్టేట్, పంచాయతీ రోడ్లున్నాయి. ఇక్కడ ప్రమాదాలు నిత్యకృత్యమవుతున్నాయి.

నెల్లూరు (టౌన్): జాతీయ రహదారిపైకెక్కాక ఇంటికి క్షేమంగా చేరుతామో, లేమోననే మీమాంస ఎంతో మందిని వెంటాడుతోంది. తామెంత జాగ్రత్తగా వాహనాలను నడిపినా, ఎదురుగా వచ్చే వారి ఏమరుపాటు వీరి ప్రాణాలను కబళిస్తోంది. నామమాత్రంగా మారిన రహదారుల నాణ్యత.. గుంతలను పూడ్చకుండా ప్యాచ్ వర్కులకే పరిమితం కావడం సైతం సమస్యకు పెనుభూతమవుతోంది. ప్రమాదకర మలుపుల వద్ద సూచిక బోర్డులు ఏ మాత్రం కానరావడంలేదు.

ప్రమాద ప్రాంతాల గుర్తింపు

రహదారుల్లో యాక్సిడెంట్లు ఎక్కువగా జరుగుతున్న 54 బ్లాక్ స్పాట్లను రవాణా శాఖ, పోలీస్, ఆర్టీసీ, నేషనల్ హైవే అధికారులు గుర్తించారు. ఉలవపాడు – మనుబోలు జాతీయ రహదారిలో 45, నెల్లూరు – కడప జాతీయ రహదారిలో ఏడు, వెంకటగిరి – పామూరు జాతీయ రహదారిలో ఇలా రెండింటిని కనుగొన్నారు. ఇక్కడ ఇవే కాకుండా మరో 40.. స్టేట్ హైవేల్లో 32 బ్లాక్ స్పాట్లను గుర్తించారు. ఆయా చోట్ల విద్యుత్ కాంతిని పెంపొందించే చర్యలు, స్పీడ్ బ్రేకర్లు, క్యాట్ఐస్ డ్రమ్ములు, సైడ్ బ్యారియర్స్, గుంతలను పూడ్చడం, సూచిక, వేగ పరిమితి బోర్డులను ఏర్పాటు చేయడం, రహదారిపైకి వచ్చిన చెట్ల కొమ్మలను తొలగించడం తదితరాలను చేపట్టాలని నేషనల్ హైవే అధికారులకు సూచించారు.

సమావేశం.. తూతూమంత్రం

కలెక్టరేట్లో రోడ్డు సేఫ్టీ సమావేశాన్ని కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రతి నెలా నిర్వహిస్తారు. దీనికి రవాణా, పోలీస్, ఆర్టీసీ, నేషనల్ హైవే, మున్సిపాల్టీ, ఆర్ అండ్ బీ, వైద్య, ఆరోగ్య శాఖ, మార్కెటింగ్, పంచాయతీ తదితర శాఖల అధికారులు హాజరవుతారు. పలు అంశాలపై కలెక్టర్ సూచనలు చేస్తున్నా, సమావేశం అనంతరం ఆయా శాఖల అధికారులు ఈ అంశాన్ని విస్మరిస్తున్నారు. ఫలితంగా మీటింగ్ లక్ష్యం నీరుగారుతోంది.



పరిమితికి మించి ఆటోలో విద్యార్థుల తరలింపు

జిల్లాలో మూడేళ్లలో..

ఏడాది	ప్రమాదాలు	మృతులు	క్షతగాత్రులు
2022	894	382	980
2023	894	433	1088
2024	822	447	897

చర్యలు చేపడుతున్నాం

జాతీయ, రాష్ట్ర రహదారుల్లో ప్రమాదాలు చోటుచేసుకోకుండా చర్యలు చేపడుతున్నాం. నేషనల్ హైవేల్లో బ్లాక్ స్పాట్లను ఇప్పటికే గుర్తించి ఆ ప్రాంతాల్లో సూచిక బోర్డులను ఏర్పాటు చేశాం. గ్రామీణ ప్రాంతాల నుంచి హైవేపైకి వచ్చే మార్గంలో స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేయాలని నేషనల్ హైవే అధికారులకు సూచించాం. రహదారి భద్రత మాసోత్సవాలు ప్రస్తుతం జరుగుతున్నాయి. విద్యార్థులు, వాహనదారులకు విస్తృత అవగాహన కల్పిస్తున్నాం

– చందర్, డీటీసీ

క్షణక్షణం.. భయం.. భయం

జిల్లా పరిధిలోని జాతీయ రహదారుల నిర్వహణ లోపభూయిష్టంగా మారింది. రోడ్లపై ఏర్పడిన గుంతలు దగ్గరికి వచ్చేంత వరకు కనిపించకపోవడం.. ఆపై సడన్ బ్రేక్ వేస్తూ వెనుక వచ్చే వాహనాలు ఢీకొని ఎంతో మంది మృత్యువాతపడుతున్నారు. వాహనాలకు ఎల్ఈడీ బల్బులను వినియోగించకూడదనే నిబంధన ఏ మాత్రం పట్టడంలేదు. జాతీయ రహదారులపై సూచిక బోర్డులు, రేడియం స్టిక్కర్లు కానరావు. ఓవర్‌లోడ్ మినహా మరే ఇతర అంశాలపై తనిఖీలు చేపడుతున్న దాఖలాల్లేవు. జాతీయ రహదారులపై ఆటోలు యథేచ్ఛగా రాకపోకలు సాగిస్తూ ప్రమాదాలకు కేంద్ర బిందువవుతున్నాయి.

తాగి.. తూలుతూ.. విధులకు

- నియంత్రణ కోల్పోయి.. ఆపై నిద్రలోకి..!
- హెల్త్ ఎడ్యుకేటర్ నిర్వాకం



నిషాలో తూగుతూ..

ఆపై నేలపై పవళించిన హెల్త్ ఎడ్యుకేటర్



వింజమూరు(ఉదయగిరి): రోగులకు వైద్యపరమైన సూచనలు, సలహాలను అందించి వారి సమస్యకు పరిష్కారం చూపాల్సిన హెల్త్ ఎడ్యుకేటర్ మద్యం మత్తులో నియంత్రణ కోల్పోయిన ఘటన వింజమూరు జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో బుధవారం చోటుచేసుకుంది. వివరాలు.. మండలంలోని చాకలికొండ పీహెచ్‌సీలో హెల్త్ ఎడ్యుకేటర్‌గా వెంకటేశ్వర్లు విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ క్రమంలో స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో లెప్రసీపై విద్యార్థులకు నిర్వహించాల్సిన అవగాహన కార్యక్రమానికి జిల్లా డిప్యూటీ పారామెడికల్ అధికారి మోహన్‌రావు హాజరయ్యారు. ఏర్పాట్లు చేయాల్సిన హెల్త్ ఎడ్యుకేటర్ పూటుగా మద్యం సేవించి ప్రాంగణానికి చేరుకున్నారు. అప్పటికే నియంత్రణ కోల్పోయిన ఆయన హెచ్ఎం గదిలోకి ప్రవేశించారు. అక్కడికి వెళ్లిన ఓ ఉపాధ్యాయురాలు ఆయన ప్రవర్తన చూసి భయంతో కేకలేస్తూ పరుగులు తీశారు. గమనించిన తోటి ఉపాధ్యాయులు ఆయన్ను స్కూల్ బయటకు తీసుకొచ్చి రోడ్డుపై పడేశారు. అనంతరం వైద్యశాల సిబ్బంది పక్కనే ఉన్న బీసీ హాస్టల్ అరుగుపై కూర్చోబెట్టారు. కొద్దిసేపటికి అక్కడి నుంచి కిందపడి నిద్రకు ఉపక్రమించారు. ఈ పరిణామాలను చూసిన సహచర ఉద్యోగులతో పాటు స్థానికులు విస్మయం వ్యక్తం చేశారు. ఈ విషయమై పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ మురళీకృష్ణను సంప్రదించగా, దీనిపై జిల్లా వైద్యాధికారికి నివేదికను అందజేస్తామని బదులిచ్చారు.

బడ్జెట్ ప్రతుల దహనం



నెల్లూరు(అర్బన్): కేంద్ర బడ్జెట్లో వ్యవసాయ రంగానికి తీరని అన్యాయం చేశారని రైతు సంఘాల నేతలు ఆరోపించారు. ఈ మేరకు గాంధీబొమ్మ వద్ద బడ్జెట్ ప్రతులను సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో బుధవారం దహనం చేశారు. ఈ సందర్భంగా రైతు సంఘాల నేతలు రమణయ్య, చిరసాని కోటిరెడ్డి మాట్లాడారు. వ్యవసాయానికి 2.5 శాతం నిధులను కేటాయించడం అన్యాయమని చెప్పారు. ప్రధాని ఫసల్ బీమా పథకానికి సంబంధించి ఈ ఏడాది రూ 2,500 కోట్లు తగ్గించారని తెలిపారు. కేంద్రం తమ నిర్ణయాన్ని ఉపసంహరించుకొని రైతులకు న్యాయం చేయాలని కోరారు.

మద్దతు ధర లభించేలా పర్యవేక్షించాలి

- కలెక్టర్ ఆనంద్



సమీక్ష సమావేశంలో ఆనంద్

నెల్లూరు రూరల్: జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు ప్రారంభంకానున్న తరుణంలో ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధరకు తగ్గకుండా రైతులు విక్రయించుకునేలా వ్యవసాయాధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని కలెక్టర్ ఆనంద్ ఆదేశించారు. వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులతో తన చాంబర్‌లో బుధవారం నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ఈ – క్రాప్‌ను ఈ నెల 25లోపు పూర్తి చేయాలని సూచించారు. సీసీఆర్ కార్డులు పొందిన కౌలు రైతులకు అవసరమైన రుణాలను బ్యాంకుల ద్వారా మంజూరు చేయించాలని కోరారు. ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించేలా ఎంపిక చేసిన ప్రాథమిక వ్యవసాయ కో ఆపరేటివ్ సొసైటీల్లో పురుగు మందు రహిత వ్యవసాయ ఉత్పత్తుల స్టాళ్ల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలన్నారు. దగదర్తిలోని పీఏసీఎస్‌లో వీటిని ఏర్పాటు చేయనున్నామని డీసీఓ గుర్రప్ప చెప్పారు. పైలట్ ప్రాజెక్ట్‌గా మార్కెటింగ్, సహకార శాఖల ఆధ్వర్యంలో గోడౌన్లను ఏర్పాటు చేసి జాతీయ గోదాముల అభివృద్ధి ప్రాధికార సంస్థ గుర్తింపు పొందేలా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. జిల్లాలో ఐదు వేల హెక్టార్లలో డ్రిప్ ఇరిగేషన్ లక్ష్యం కాగా, ఇప్పటికే మూడు వేల ఎకరాల్లో అమర్చామని ఏపీఎంఐపీ పీడీ శ్రీనివాసులు వివరించారు. జిల్లా వ్యవసాయాధికారి సత్యవాణి, మత్స్యశాఖ జేడీ నాగేశ్వరరావు, పశుసంవర్ధక శాఖ జేడీ రమేష్‌నాయక్, జిల్లా ఉద్యానాధికారి సుబ్బారెడ్డి, ప్రకృతి వ్యవసాయ సంస్థ ప్రాజెక్ట్ మేనేజర్ మాలకొండయ్య, మార్కెటింగ్ శాఖ ఏడీ అనిత, మార్క్‌ఫెడ్ డీఎం పవన్‌కుమార్ పాల్గొన్నారు.

సదరం.. ఇదో నరకం



ఈ చిత్రంలో కనిపిస్తున్న దివ్యాంగుడు అఖిల్ నెల్లూరులోని ఉమ్మారెడ్డిగుంట వాసి. బేల్దారి పనులతో తండ్రి బొమ్మన హజరత్తయ్య జీవనం సాగిస్తున్నారు. సర్టిఫికెట్ల రీ వెరిఫికేషన్ నిమిత్తం కుమారుడ్ని వీల్‌చైర్‌లో కూర్చోబెట్టి నెట్టుకుంటూ జీజీహెచ్‌కు తీసుకొచ్చారు. ఈ వీల్‌చైర్ పెద్దాస్పత్రిది అనుకుంటే పొరపాటే. ఇది అందుబాటులో లేదని తెలుసుకున్న తండ్రి సొంతంగా కొనుగోలు చేశారు.



వీల్‌చైర్‌లో కదల్లేని ఈ వ్యక్తి పేరు సాయికృష్ణ. రెడ్‌క్రాస్ ద్వారా నిర్వహిస్తున్న మానసిక దివ్యాంగుల కేంద్ర విద్యార్థి. ఈ వీల్‌చైర్ సైతం పెద్దాస్పత్రిది కాదు. బిడ్డ తల్లి సొంతంగా కొనుగోలు చేసి సదరం క్యాంపునకు తీసుకొచ్చారు. రీ వెరిఫికేషన్ చేయించుకోకపోతే ప్రభుత్వం అందజేస్తున్న సామాజిక పింఛన్ ఆగిపోతుందనే భయంతో వ్యయప్రయాసలకోర్చి నడవలేని, కదల్లేకుండా, మంచంపై ఉన్న దివ్యాంగులందరూ తమ కుటుంబసభ్యులతో పెద్దాస్పత్రిలో నిర్వహిస్తున్న క్యాంపునకు వస్తున్నారు.

- మూడో రోజూ అవే సమస్యలు
- దొరకని వీల్‌చైర్లు
- దాతలు సమకూర్చినవి ఇతర అవసరాలకు
- గత్యంతరం లేక కొనుగోలు చేస్తున్న దివ్యాంగులు
- ఉపయోగంలేని హెల్ప్ డెస్క్

నెల్లూరు(అర్బన్): దివ్యాంగులకు అందజేస్తున్న సామాజిక పింఛన్ల రీ వెరిఫికేషన్ నిమిత్తం ప్రభుత్వం నిర్వహిస్తున్న సదరం క్యాంపులు వారి పాలిట నరకంగా మారుతున్నాయి. వీటికి కోత పెట్టడమే లక్ష్యంగా జిల్లాలోని 32,638 మంది దివ్యాంగ పింఛన్‌దారులను రీ వెరిఫికేషన్ సెంటర్లకు రప్పిస్తోంది. ఈ నెల మూడున ప్రారంభమైన ప్రక్రియ జూన్ వరకు కొనసాగనుంది. జిల్లాలోని ఏడు ఆస్పత్రులు.. నగరంలోని ప్రభుత్వ పెద్దాస్పత్రిలో దివ్యాంగుల కేంద్రాలను నాలుగింటిని ఏర్పాటు చేశారు.

కొన్ని సమస్యలకు ఇక్కడికే రావాలి

కొన్ని రకాల సమస్యలకు ఇతర కేంద్రాల్లో పరీక్షలను వైద్యులు చేస్తున్నారు. అదే మానసిక, ఈఎన్టీ, నేత్ర పరీక్షలకు మాత్రం పెద్దాస్పత్రిలోని సదరం సెంటర్‌కు జిల్లాలోని అన్ని ప్రాంతాల దివ్యాంగులు రావాల్సి ఉంది. రోజూ 300 మందిని పరీక్షించేలా ప్రణాళికను సిద్ధం చేశారు. వీరితో పాటు సహాయకులు కలిసి సుమారు 700 నుంచి 800 మంది వరకు వస్తున్నారు.

వితరణ చేసిన పక్క రోజుకే మాయం..!

సదరం క్యాంపునకు వచ్చే వారికి కనీస సౌకర్యాలను కల్పించడంలో అధికారుల తీరు ఏ మాత్రం మారడంలేదు. ఫలితంగా దివ్యాంగులకు వీల్‌చైర్ దొరకడం గగనమవుతోంది. వీటిని కొంతమంది సిబ్బంది గదుల్లో ఉంచి తాళాలేసి అవసరమైన సమయాల్లో ఇతర పనులకు వినియోగిస్తున్నారు. పెద్దాస్పత్రికి వీల్‌చైర్‌లు, ట్రైసైకిళ్లను రెండు చొప్పున ఆరణి కందప్పమేస్త్రి సత్ర నిర్వాహకులు మంగళవారం అందజేశారు. సదరం క్యాంపులో రీ వెరిఫికేషన్ నిమిత్తం వచ్చే వారికి ఉపయోగిస్తామని ఆస్పత్రి సూపరింటెండెంట్ సిద్ధానాయక్ మీడియాకు తెలిపారు. అయితే బుధవారం నాటికి ఇవి ఎక్కడున్నాయో ఎవరికీ తెలియలేదు.

వెతికినా ప్రయోజనమేదీ..?

వీల్‌చైర్లు, స్ట్రెచర్ల కోసం గంటల తరబడి వెతికినా దొరకడం లేదు. అక్కడక్కడా దయదలిచిన సిబ్బంది కొంతమందికి మాత్రమే ఏర్పాటు చేయగలగుతున్నారు. మిగిలిన వారి బాధలు అంతులేనివి. మరోవైపు పెద్దాస్పత్రిలో ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్ ఏ మాత్రం ఉపయోగపడటంలేదు. వీరి కళ్ల ముందే నడవలేక దివ్యాంగులు నానా అగచాట్లు పడుతున్నా పట్టించుకోవడం లేదు. ఆహారం, తాగునీరు కొంతమందికి అందితే మిగిలిన వారికి అందడంలేదు. పరిస్థితిని ఇప్పటికైనా చక్కదిద్దాలని రోగులు, దివ్యాంగులు, సహాయకులు కోరుతున్నారు.



అతికష్టంపై నడుస్తున్న వృద్ధుడికి సాయపడుతూ..



ఈఎన్టీ క్యాంప్ వద్ద పేర్ల నమోదుకు గుమిగూడిన దివ్యాంగుల కుటుంబసభ్యులు

ఇతర అవసరాలకు వినియోగం

రోగుల కోసం పెద్దాస్పత్రికి దాతలిచ్చిన వీల్‌చైర్లను సిబ్బంది వివిధ అవసరాలకు వినియోగిస్తున్నారు. ఇండెంట్ పుస్తకాలు, రోగుల బెడ్‌షీట్లు, మందులకు సంబంధించిన మెటీరియల్‌ను ఉంచి నెట్టుకుంటూ వస్తున్నారు. ఇలా ఇతర పనులకు దర్జాగా వినియోగిస్తున్నారు. అధికారులు, సిబ్బంది తీరు మారకపోవడంతో దివ్యాంగుల సమస్యలు వర్ణనాతీతమవుతున్నాయి.



చక్కదిద్దుతున్నాం

రోగులకు తొలి రోజే కొంత ఇబ్బంది కలిగింది. మరుసటి రోజుకు పరిస్థితులను చక్కదిద్దాం. వీల్‌చైర్లను అందుబాటులో ఉంచాం. రోగులు, దివ్యాంగుల కోసం వినియోగించే వీటిని ఇతర పనులకు కేటాయిస్తే సిబ్బందిపై కఠిన చర్యలు చేపడతాం. హెల్ప్‌డెస్క్‌ను మరింత పటిష్టపర్చి, రోగుల ఇబ్బందులను తొలగిస్తాం.

– సిద్ధానాయక్, సూపరింటెండెంట్, పెద్దాస్పత్రి

క్లుప్తంగా

కోనేరులో యువకుడి గల్లంతు



కోనేరు వద్ద స్థానికులు

ఇందుకూరుపేట: మండలంలోని గంగపట్నం చాముండేశ్వరీదేవి అమ్మవారి ఆలయ ఆవరణలో ఉన్న కోనేరులో ఓ యువకుడు గల్లంతయ్యాడు. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. నరుకూరుకు చెందిన ఈగ కృష్ణతేజ (20) తన భార్య శ్రావణి, ఇంటి పక్కనుండే దంపతులు ముత్యాలు, మునెమ్మతో కలిసి అమ్మవారి దర్శనం కోసం ఆలయం వద్దకు బుధవారం వచ్చాడు. ఈ క్రమంలో కృష్ణతేజ, ముత్యాలు మద్యం తాగారు. అనంతరం ఇద్దరూ కలిసి కోనేరులో దిగారు. కృష్ణతేజ గల్లంతయ్యాడు. సమాచారం అందుకున్న ఎస్సై నాగార్జున గజ ఈతగాళ్ల ద్వారా గాలింపు చర్యలు చేపట్టారు.

ఇద్దరు దొంగల అరెస్ట్



మాట్లాడుతున్న సీఐ గంగాధర్

మర్రిపాడు: మండలంలోని రెండు దేవాలయాల్లో దొంగతనాలు చేసిన ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు ఆత్మకూరు సీఐ గంగాధర్ తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మర్రిపాడు ఎస్సై శ్రీనివాసరావుతో కలిసి బుధవారం వివరాలు వెల్లడించారు. నందవరం శివాలయం, పొంగూరు పోలేరమ్మ గుడిలోని హుండీల్లో నగదును కాజేసిన వైఎస్సార్ జిల్లా పోరుమామిళ్ల మండలం అక్కలరెడ్డిపల్లికి చెందిన దాసరపల్లి పోలయ్య, గోపవరం మండలానికి చెందిన షేక్ లాల్‌బాషాను మండలంలోని చుంచులూరు కూడలి వద్ద పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.8 వేల నగదు, చోరీకి వినియోగించిన ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ వివరించారు.

మద్యం దుకాణాలకు దరఖాస్తు గడువు పొడిగింపు

నెల్లూరు(క్రైమ్): కల్లుగీత కార్మికులకు జిల్లాలో కేటాయించిన 18 మద్యం దుకాణాలకు నామమాత్రంగా దరఖాస్తులు దాఖలయ్యాయి. దీంతో గడువును ఈనెల 8వ తేదీ వరకు పొడిగిస్తూ జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. వివిధ వర్గాలకు షాపులను కేటాయించారు. గతనెల 27వ తేదీ నుంచి రూ.2 లక్షల నాన్ రీఫండబుల్ ఫీజుతో ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైంది. బుధవారం సాయంత్రంతో స్వీకరణ ముగిసే నాటికి కేవలం 27 దరఖాస్తులు మాత్రమే దాఖలయ్యాయి. దీంతో ఎక్సైజ్ శాఖ అధికారి ఎ.శ్రీనివాసులు నాయుడు ఈ గడువును ఈనెల 8వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. 10వ తేదీ ఉదయం 9 గంటలకు పొదలకూరురోడ్డులోని నూతన జెడ్పీ కార్యాలయ సమావేశ మందిరంలో కలెక్టర్ సమక్షంలో లక్కీ డిప్ ద్వారా షాపులను కేటాయించనున్నారు. ఇప్పటి వరకు అత్యధికంగా ఏడు దరఖాస్తులు నెల్లూరు నగరంలోని దుకాణానికి దాఖలయ్యాయి.

పదోన్నతులు ఇవ్వాలని వినతి



డీఎంహెచ్‌ఓకు వినతిపత్రం ఇస్తున్న నేతలు

నెల్లూరు(అర్బన్): గ్రామ, వార్డు సచివాలయాల్లో పని చేస్తున్న గ్రేడ్ – 3 ఏఎన్‌ఎంలకు తక్షణమే ప్రమోషన్లు కల్పించాలని ఏపీ ఎన్జీఓ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మన్నేపల్లి పెంచలరావు కోరారు. బుధవారం సంతపేటలోని వైద్యశాఖ కార్యాలయంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ సుజాతకు ఆ సంఘం నాయకులు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా పెంచలరావు మాట్లాడుతూ ఏఎన్‌ఎంల ప్రమోషన్లు చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఈనెల 2వ తేదీన హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ పెండింగ్‌లోని అంశాలను పరిష్కరించి ప్రమోషన్లు ఇవ్వాలని అన్ని జిల్లాల డీఎంహెచ్‌ఓలకు ఆదేశాలు జారీ చేశారని గుర్తు చేశారు. అందువల్ల జిల్లాలో వెంటనే సీనియారిటీ జాబితాను తయారు చేసి త్వరగా ప్రమోషన్లు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఎన్జీఓ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండారుపల్లి వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శి రామకృష్ణ, అసోసియేట్ అధ్యక్షుడు నందిమండలం ఆంజనేయవర్మ, పులి సతీష్‌బాబు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి	: రూ.37
సన్నవి	: రూ.27
పండ్లు	: రూ.18

పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్)	: 116
లేయర్ (లైవ్)	: 85
బ్రాయిలర్ చికెన్	: 210
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 234
లేయర్ చికెన్	: 145

‘స్వప్న’ం సాకారం

ఇంటర్మీడియట్ పూర్తి కాగానే ఆమెకు పెళ్లి జరిగింది. అయితే కుటుంబ సభ్యులను ఒప్పించి బీటెక్, ఎంటెక్ పూర్తి చేసి ఐటీ కొలువులో చేరింది. అదే సమయంలో అనారోగ్యానికి గురైంది. అప్పుడే యోగా ఆమె జీవితాన్ని మరో మలుపు తిప్పింది. అనారోగ్యాన్ని సరి చేసేందుకు శిక్షణకు ఉపక్రమించి.. అందులోనే డాక్టరేట్ సాధించింది. నేడు ఐటీ ఇంజినీర్‌గా, తల్లిగా, యోగా క్రీడాకారిణిగా, ఇన్‌స్ట్రక్టర్‌గా బహుముఖ పాత్ర పోషిస్తోంది.

- ఇంటర్ పూర్తవగానే వివాహం
- ఆ తర్వాత ఇంజినీరింగ్ చేసి ఐటీ ఉద్యోగం సాధించి..
- యోగాలో అడుగుపెట్టి ప్రతిభ చూపుతున్న స్వప్న
- నేడు క్రీడాకారిణిగా, ఇన్‌స్ట్రక్టర్‌గా రాణిస్తూ..
- ట్రైనర్ నుంచి యోగా అంబాసిడర్‌గా ఎదిగిన ప్రస్థానం



యోగా పోటీల్లో పాల్గొన్న స్వప్న

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): చాలామంది మహిళలు పెళ్లి కాగానే తమ కలల్ని పక్కన పెట్టేస్తారు. కొందరు మాత్రం సాకారం చేసుకునేందుకు కృషి చేస్తారు. ఈ కోవలోకే వస్తారు నెల్లూరు నగరంలోని పెద్దబజారుకు చెందిన స్వప్న. జేకే అశోక్ సింగ్, అనితాభాయ్ దంపతుల కుమార్తె అయిన స్వప్నకు ఇంటర్మీడియట్ పరీక్షలు అయిపోగానే జేపీ శ్యామ్ సింగ్ అనే వ్యక్తితో పెళ్లి జరిగింది. చిన్ననాటి నుంచి తన కలలను కుటుంబ సభ్యులకు చెప్పి.. వారిని ఒప్పించి బీటెక్, ఎంటెక్ పూర్తి చేసింది. ఆమెకు ముగ్గురు కుమార్తెలు. ఓ వైపు పిల్లల బాధ్యతలు చూసుకుంటూనే మరోవైపు ఐటీ ఉద్యోగినిగా రాణించింది.

వివిధ కోర్సులు చేసి..

స్వప్న ఐటీ ఉద్యోగినిగా ఉన్న సమయంలో బెంగళూరు – నెల్లూరు ప్రయాణాలు చేస్తున్నప్పుడు సయాటికా బారిన పడింది. అప్పట్లో యోగా సాధనతో అనేక జబ్బులను అధిగమించవచ్చని తెలుసుకుంది. ఆ తర్వాత ఆ దిశగా అడుగులు వేసింది. అనారోగ్య సమస్య పోయింది. యోగాలో రాణించాలనే ఆశ ఆమెలో కలిగి వివిధ కోర్సులు చేసింది. ఓ వైపు ఇతరులకు నేర్పిస్తూ.. మరో వైపు పోటీల్లో పాల్గొంది. జాతీయ స్థాయిలో 35 ఏళ్ల విభాగంలో ప్రథమ స్థానాన్ని సాధించింది. యోగా శిక్షకురాలిగా గుర్తింపు పొందింది. దక్షిణ భారతదేశంలోని రాష్ట్రాల్లో యోగా ట్రైనర్‌గా అనేక సెమినార్‌ల్లో పాల్గొని క్లాసులు నిర్వహించింది. 2017 నుంచి యోగా తరగతులకు ఎగ్జామినర్‌గా కేంద్రం ఆమెను నియమించింది. ఈ ఏడాది బెంగళూరులోని ఎస్ – వ్యాస విశ్వవిద్యాలయం ఛాన్స్‌లర్ డాక్టర్ హెచ్ఆర్ నాగేంద్ర నేతృత్వంలో ‘ప్రాచీన భారతీయ సాహిత్యం, యోగాను ఆధారంగా తీసుకుని పాఠశాలల పిల్లల్లో జీవన నైపుణ్యాలు, మానవ విలువలను మెరుగుపరచడం’ అనే అంశంపై చేసిన పరిశోధనకు స్వప్నకు డాక్టరేట్ లభించింది. ఈ పరిశోధనకు సంబంధించిన పలు అంశాలను ప్రతిష్టాత్మక జనరల్స్‌లో ప్రచురించారు. ఇప్పటి వరకు దేశ, అంతర్జాతీయ స్థాయిలో ఎన్నో అవార్డులు, రివార్డులు పొందిన ఆమెను యోగాలో వివిధ దేశాల్లో అంబాసిడర్‌గా నియమిస్తూ ఇండియన్ కౌన్సిల్ ఫర్ కల్చరల్ రిలేషన్స్ గత నెలలో ఉత్తర్వులిచ్చింది.

గర్వంగా ఉంది



తెలుగు రెండు రాష్ట్రాల నుంచి భారతదేశ అంబాసిడర్‌గా ఎంపికవడం గర్వంగా ఉంది. ఇతర దేశాల్లో మన దేశ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రాచుర్యం కల్పించే అవకాశం రావడం పూర్వజన్మ సుకృతం. యోగాలోకి అనుకోకుండా వచ్చి ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొని కుటుంబ, సామాజిక పరిస్థితులపై అవగాహన కల్పించుకుని ఈ స్థాయికి రావడం సంతోషంగా ఉంది.

– జేకే స్వప్న





యోగా చేస్తూ..

ఎన్‌ఎస్ఎస్ విద్యార్థులకు అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న ఇన్‌చార్జి వీసీ

వెంకటాచలం: గత నెల 26వ తేదీన ఢిల్లీలో జరిగిన గణతంత్ర దినోత్సవ పరేడ్‌లో విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ) ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ఎల్.తేజస్విని, ఎం.షాలిని, బి.యుగంధర్‌లు పాల్గొని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్, ప్రధాని నరేంద్రమోదీల ప్రశంసలు పొందారు. వీరిని బుధవారం వర్సిటీలో ఇన్‌చార్జి వీసీ విజయభాస్కరరావు, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ కె.సునీత, ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ డాక్టర్ ఉదయ్‌శంకర్ తదితరులు అభినందించారు.

వివిధ పోస్టుల భర్తీకి చర్యలు

నెల్లూరు(అర్బన్): ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్ ఆస్పత్రుల్లో ఖాళీగా ఉన్న జనరల్ డ్యూటీ అటెండెంట్, పోస్టుమార్టం అసిస్టెంట్ కమ్ బయోస్టాటిస్టిషన్ పోస్టుల భర్తీకి చర్యలు చేపట్టామని జిల్లా ఆస్పత్రుల సమన్వయాధికారి డాక్టర్ రమేష్‌నాథ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన వాటిని భర్తీ చేస్తామన్నారు. అర్హులైన అభ్యర్థులు ఈనెల 20వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. నోటిఫికేషన్, వివరాల కోసం హెచ్‌టీటీపీఎస్://ఎస్పీఎస్ఆర్‌నెల్లూరు.ఏపీ.జీఓవీ.ఇన్/నోటీసు అండర్ స్కోర్ కేటగిరీ/రిక్రూట్‌మెంట్ అనే వెబ్‌సైట్‌ను సందర్శించాలని తెలియజేశారు.

అన్నదాతలు నష్టపోతున్నారు



డీఆర్వోకు వినతిపత్రం అందజేసి మాట్లాడుతున్న రైతు సంఘాల నాయకులు

- ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి
- రైతు సంఘాల ఐక్యవేదిక డిమాండ్

నెల్లూరు(అర్బన్): ‘నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడా వరికోతలు ప్రారంభమయ్యాయి. దళారుల వల్ల అన్నదాతలు నష్టపోతున్నారు. ఈ నేపథ్యంలో తక్షణమే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి వారిని ఆదుకోవాలి’ అని జిల్లా రైతు సంఘాల ఐక్యవేదిక అధ్యక్షుడు చిరసాని కోటిరెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం వేదిక ఆధ్వర్యంలో పలు రైతు సంఘాల నాయకులు నెల్లూరు కలెక్టరేట్‌లో డీఆర్వో ఉదయభాస్కర్‌రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కోటిరెడ్డి మాట్లాడుతూ తిరుపతి జిల్లాలో పుట్టి ధాన్యాన్ని కనీస మద్దతు (ఎంఎస్‌పీ) ధర కన్నా రూ.4 వేల నుంచి రూ.5 వేల వరకు తగ్గించి దళారులు కొంటున్నారన్నారు. నెల్లూరు జిల్లాలో పుట్టి రూ.16 వేలకే కొనుగోలు చేయడం వల్ల రైతులు పుట్టికి రూ.3,750 నష్టపోతున్నారన్నారు. ప్రారంభంలోనే ఇంత తక్కువ ధరకు కొనుగోలు చేస్తే కోతలు ముమ్మరంగా జరిగే నాటికి పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చన్నారు. ఏ – గ్రేడు ధాన్యాన్ని రూ.19,750కు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఇతర జిల్లాల నుంచి ప్యాడీ డ్రయర్లను తీసుకుని వచ్చి రైతులకు అందించి ధాన్యాన్ని త్వరగా ఆరబెట్టుకునేందుకు సాయం చేయాలన్నారు. ధాన్యం నగదుతోపాటు హమాలీల కూలీలు, రవాణా చార్జీలు రైతుల ఖాతాల్లో జమ చేయాలని కోరారు. కౌలు రైతులకు నష్టం రాకుండా చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘాల నాయకులు రాధాకృష్ణారెడ్డి, గంగపట్నం రమణయ్య, షాన్‌వాజ్, ఏవీఆర్ నాయుడు, శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

నిమ్మ రైతులకు కష్టాలు

- గతేడాది బస్తా ధర రూ.6 వేలు
- నేడు రూ.2,800

పొదలకూరు: సాధారణంగా ఈ సమయానికి నిమ్మ మార్కెట్ యార్డు కళకళలాడుతుండాలి. రైతులు ఆర్థిక లావాదేవీలతో బిజీగా ఉంటూ నిమ్మకాయలను మార్కెట్‌కు తరలించేందుకు ఉత్సాహం చూపుతుంటారు. అయితే నేడు ఆ పరిస్థితి లేదు. అటు వ్యాపారుల్లో.. ఇటు రైతుల్లో హుషారు లేకుండాపోయింది. ప్రస్తుతం నిమ్మ ధరలు కిలో రూ.27 నుంచి రూ.37 పలుకుతోంది. బస్తాల (లూజు) లెక్కన పరిశీలిస్తే రూ.2 వేల నుంచి రూ.2,800 మాత్రమే ఉంది. గతేడాది ఇదే సమయంలో బస్తా రూ.6 వేల వరకు పలికింది. అంతేకాక ఏడాది పొడవునా రైతులకు గిట్టుబాటు ధరలు లభించి కొంతవరకు ఆర్థికంగా నిలదొక్కుకున్నారు. అయితే ఈ సీజన్‌లో నిమ్మ రైతులకు కష్టాలు మొదలైనట్టుగా తెలుస్తోంది. తోటల్లో పూత ఆలస్యంగా పూయడంతోపాటు ధరల్లేని సమయంలో దిగుబడి పెరిగింది. దీంతో ప్రస్తుతం బస్తా రూ.6 వేలు ధర పలకాల్సి ఉండగా చాలా తక్కువగా ఉంది. రైతులు పెట్టుబడులు పెట్టి ఆరుగాలం కష్టించి పనిచేస్తూ తోటలను కాపాడుకోగలుగుతున్నారు. చీడపీడలు అధికంగా ఉండే తోటలకు ఏడాది పొడువునా పురుగు మందులను పిచికారీ చేయాల్సి ఉంటుంది. అంతేకాక కంపోస్టు ఎరువులను ఊరూరా తిరిగి పాడిరైతుల నుంచి సేకరించి రూ.వేలు వెచ్చించి తోటలకు తోలాల్సి ఉంటుంది. ఎన్ని కష్టాలు పడినా ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్ నెలల్లోనే తగిన ప్రతిఫలం లభిస్తుంది. అయితే ఈ నెలల్లో కాయల ధరలు ఆశించిన స్థాయిలో పెరిగే పరిస్థితులు లేవని, దీనికితోడు కాయల దిగుబడి తగ్గే అవకాశం ఉందని రైతులు వాపోతున్నారు.



మార్కెట్‌లో నిమ్మకాయలు

నెల్లూరులో విస్తృతంగా వాహన తనిఖీలు



సంతపేట వద్ద తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

నెల్లూరు(క్రైమ్): నేర నియంత్రణ, ప్రమాదాల నివారణ చర్యల్లో భాగంగా నెల్లూరు డీఎస్పీ పి.సింధుప్రియ ఆదేశాల మేరకు పోలీస్ అధికారులు నగరంలో బుధవారం సాయంత్రం విస్తృతంగా వాహన తనిఖీలు నిర్వహించారు. నిబంధనల ఉల్లంఘనకు పాల్పడిన వాహనదారులపై కొరడా ఝుళిపించారు. ట్రిపుల్ రైడింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్, హెల్మెట్ లేకపోవడం, ఇతర పత్రాల్లేని వాహనదారులకు భారీగా జరిమానాలు విధించారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారులు మాట్లాడుతూ వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు విధిగా పాటించాలన్నారు. తనిఖీల్లో ఇన్‌స్పెక్టర్లు చిట్టెం కోటేశ్వరరావు, అన్వర్‌బాషా, దశరథరామారావు, రోశయ్య, శ్రీనివాసులురెడ్డి, సాంబశివరావు, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు వెంకటరెడ్డి, రామకృష్ణ, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

జామాయిల్ కర్ర అక్రమ రవాణాను అడ్డుకోవాలి

- తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేత

వరికుంటపాడు: ‘ఉదయగిరి నియోజకవర్గంలో వివిధ మండలాల్లో 1,500 ఎకరాల అగ్రిగోల్డ్ భూముల్లో ఉన్న జామాయిల్ కర్ర అక్రమ రవాణాను అడ్డుకోవాలి. అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలి’ అని సీపీఐ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య, అగ్రిగోల్డ్ ఏజెంట్స్, కస్టమర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరుపతిరావు డిమాండ్ చేశారు. వరికుంటపాడు మండలం కనియంపాడులో ఉన్న అగ్రిగోల్డ్ భూములను బుధవారం వారు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కనియంపాడులో సుమారు 150 ఎకరాల భూముల్లో జామాయిల్ కర్రను నరికి అక్రమంగా లారీల్లో యథేచ్ఛగా తరలిస్తున్నా పోలీసు, రెవెన్యూ, సీఐడీ శాఖలు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఈ తంతు వెనుక రాజకీయ శక్తులు ఉండటంతో అధికార యంత్రాంగం పట్టించుకోలేదని ఆరోపించారు. అక్రమంగా నరికిన కర్రను స్వాహా చేయకుండా, ఇకపై నరికివేత జరగకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలని కోరారు. అక్రమ రవాణా జరిగితే అక్రమార్కులను అడ్డుకుంటామని హెచ్చరించారు. జిల్లా కేంద్రంలో ధర్నా చేస్తామని తెలిపారు. అగ్రిగోల్డ్ బాధితులతో భూములు స్వాధీనం చేసుకునేందుకు కూడా వెనుకాడబోమని స్పష్టం చేశారు. అనంతరం తహసీల్దార్ హేమంత్ కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఫిర్యాదు చేసేందుకు పోలీస్‌స్టేషన్‌కు వెళ్తే ఎస్సై లేకపోవడంతో వెనుదిరిగారు. కావలి డీఎస్పీని కలిసి వినతిపత్రం అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో అగ్రిగోల్డ్ అసోసియేషన్ ప్రతినిధులు శంకరయ్య, మాల్యాద్రి, శ్రీరంగయ్య తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నేతలు

వైద్యశాఖలో తుది మెరిట్ జాబితా విడుదల

నెల్లూరు(అర్బన్): జిల్లా వైద్యారోగ్య శాఖలో నేషనల్ హెల్త్ మిషన్ విభాగం కింద ఆత్మకూరులోని డైస్ సెంటర్‌లో ఖాళీగా ఉన్న ఆడియాలజిస్ట్ కమ్ స్పీచ్ థెరపిస్ట్, డెంటల్ టెక్నీషియన్ పోస్టులకు ఇటీవల కాంట్రాక్ట్ విధానంలో దరఖాస్తు చేసుకున్న వారికి సంబంధించిన తుది మెరిట్ జాబితాను విడుదల చేశామని డీఎంహెచ్‌ఓ డాక్టర్ సుజాత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలను ఎస్పీఎస్‌నెల్లూరు.ఏపీ.జీఓవీ.ఇన్/నోటీసు/ రిక్రూట్‌మెంట్ అనే వెబ్‌సైట్‌లో పొందుపరిచామని తెలిపారు. అభ్యర్థులు పరిశీలించుకోవాలని సూచించారు.

సంగంలో కార్డన్ సెర్చ్



తిరుమనతిప్పలో కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

- 45 బైక్‌లు, 5 ఆటోల స్వాధీనం

సంగం: ఎస్పీ కృష్ణకాంత్ ఆదేశాల మేరకు మండల కేంద్రమైన సంగంలో ఆత్మకూరు డీఎస్పీ వేణుగోపాల్ ఆధ్వర్యంలో బుధవారం కార్డన్ సెర్చ్ జరిగింది. సుమారు 400 గృహాల్లో తనిఖీలు నిర్వహించారు. సరైన పత్రాల్లేని 45 మోటార్‌బైక్‌లు, ఐదు ఆటోలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ చట్ట వ్యతిరేక కార్యకలాపాలు, దొంగతనాల నివారణ, శాంతిభద్రతల పరిరక్షణ, అసాంఘిక శక్తుల ఏరివేతే లక్ష్యంగా కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్నామన్నారు. జిల్లాలో అసాంఘిక కార్యకలాపాలను అరికట్టేందుకు ఎస్పీ ప్రత్యేక ప్రణాళికతో ముందుకెళ్తున్నట్లు చెప్పారు. సంగం పరిధిలోని తిరుమనతిప్పలోని ప్రతి ఇంటిని క్షుణ్ణంగా పరిశీలించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సంగం సీఐ వేమారెడ్డి, ఆత్మకూరు సీఐ గంగాధర్, ఎస్సైలు రాజేష్, శ్రీనివాసరావు, స్పెషల్ పార్టీ పోలీసులు, సిబ్బంది పాల్గొన్నారు.

నాలుగు పొగాకు బ్యారన్ల దగ్ధం



కృష్ణారెడ్డిపాళెంలోని బ్యారన్లు

కలిగిరి: మండలంలోని కృష్ణారెడ్డిపాళెంలో మూడు పొగాకు బ్యారన్లు దగ్ధమైన ఘటన బుధవారం జరిగింది. దీంతో సుమారు రూ.12 లక్షల మేర రైతులకు నష్టం వాటిల్లింది. బాధితుల కథనం మేరకు.. పల్లపోలు కాంతమ్మ, చాగంటి ధనమ్మ, దండా శాంతమ్మలకు చెందిన పొగాకు బ్యారన్లు వరుసగా ఆనుకుని ఉన్నాయి. వాటిల్లో పొగాకు క్యూరింగ్ చివరి దశలో ఉంది. బుధవారం వేకువజామున ధనమ్మకు చెందిన బ్యారన్‌లో పొగాకు అల్లిన కర్ర గొట్టాలపై పడటంతో మంటలు చెలరేగాయి. అవి పక్కనున్న బ్యారన్లకు వ్యాపించాయి. దీంతో వాటిల్లోని పొగాకు, అల్లుడు కర్రలు, టైర్లు, ఇనుప గొట్టాలు పూర్తిగా కాలిపోయాయి. సమాచారం అందుకున్న వింజమూరు అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. సుమారు రూ. 12 లక్షల మేర నష్టం వాటిల్లిందని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. పొగాకు బోర్డు అధికారులు వివరాలను సేకరించారు.

- మర్రిపాడు: మండలంలోని డీసీపల్లి పంచాయతీ ఖాన్‌సాహెబ్‌పేట గ్రామంలో బుధవారం బ్యారన్‌లో అగ్ని ప్రమాదం జరిగింది. స్థానికుల కథనం మేరకు.. వెన్నపూస చెన్నయ్యకు చెందిన బ్యారెన్‌లో ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. దీంతో సుమారు రూ.4 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు వాపోయారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.